సాక్షి నల్లగొండ

గురువారం । 30 । మే । 2024



బాధితుల న్యాయపోరాటం

పుడమి ప్రాజెక్స్ కంపెనీ నిర్వాహకులపై న్యాయ పోరాటం చేసేందుకు బాధితులు సిద్ధమవుతున్నారు.

- 8లో



జీవనభృతి ఇప్పించండి..

కుమారుడి నుంచి జీవనభృతి ఇప్పించాలని వృద్ధ దంపతులు కోరుతున్నారు.

- 8లో

గరిష్ఠం / కనిష్ఠం

43^{o} / 32^{o}

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ టూటౌన్ : 2025 గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లోని ప్రముఖులకు కేంద్ర ప్రభుత్వం ఇవ్వనున్న పద్మ అవార్డులకు సిఫారసు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి అధికారి మక్బూల్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళారంగం, సామాజిక సేవ, ప్రజాసేవ, విజ్ఞానశాస్త్రం, ఇంజనీరింగ్, వ్యాపారం, పరిశ్రమలు, వైద్యశాస్త్రం, సాహిత్యం, విద్య, క్రీడలు తదితర రంగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో విశేష కృషి చేసిన జిల్లాకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆయా రంగాల్లో చేసిన సేవా కార్యక్రమాలకు సంబంధించి 800 పదాలకు మించకుండా www.padmaawards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు నింపాలని సూచించారు. దరఖాస్తు చేసిన వివరాల ధ్రువీకరణ పత్రాల మూడు సెట్లను జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయంలో జూన్ 1వ తేదీలోగా అందజేయాలని కోరారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నల్లగొండ : నల్లగొండలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ సమావేశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ సమావేశాలకు ఆయా సంఘాల చైర్మన్లు, సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయం

- డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

నల్లగొండ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే గెలుపొందడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తీన్మార్ మల్లన్నను ఓడించడానికి బీఆర్ఎస్, బీజేపీ నేతలు అనేక కుట్రలు పన్నారని విమర్శించారు. ఓటమి భయంతో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు పోలే జయకుమార్, కేవీఆర్ యువసేన జిల్లా అధ్యక్షుడు మామిడి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగులను ఆదుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : సీపీఎస్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మిర్యాలగూడలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ ఉద్యోగుల బతుకులు గాలికి దీపంలా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల మృతి చెందిన రిటైర్డ్ సీపీఎస్ ఒకేషనల్ టీచరు ఎద్దు ఉపేందర్ అంత్యక్రియలకు చందాలు వసూలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఉద్యోగుల రిటైర్డ్ అనంతరం పెన్షన్ సౌకర్యం లేకపోవడంతో వృద్ధాప్యంలో ఆర్థిక, అనారోగ్య సమస్యలతో సతమతం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శిరందాసు రామదాసు, ప్రధాన కార్యదర్శి బొమ్మనబోయిన శ్రీనివాస్, ఠాగూర్ సురేందర్‌సింగ్, పంకజ్‌రెడ్డి, నల్లమేకల వెంకయ్య, విజయ్, కొరివి కృష్ణ, ఏడుకొండలు తదితరులున్నారు.



మాట్లాడుతున్న నాగవెల్లి ఉపేందర్

చెరువుల చదును!

మిర్యాలగూడలో యథేచ్ఛగా శిఖం భూముల కబ్జా





ఈ ఫొటోలు మిర్యాలగూడ శివారులోని యాద్గార్‌పల్లి పందిర్లపల్లి చెరువులోనివి. ఈ చెరువు శిఖం కబ్జాకు గురవుతుందని వస్తున్న ఫిర్యాదుల మేరకు మంగళవారం మిర్యాలగూడ ఆర్డీఓ శ్రీనివాసరావు పందిర్లపల్లి చెరువు శిఖంలోని నీటి కుంటను పరిశీలించారు. చెరువుకు హద్దులు ఏర్పాటు చేయాలని ఐబీ, నీటిపారుదల అధికారులను ఆదేశించారు. జేసీబీ, ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేయించారు. కానీ, మంగళవారం రాత్రికి రాత్రే కబ్జారాయుళ్లు ఆ నీటి కుంటను మట్టితో పూడ్చి వేయడంతో బుధవారం అక్కడ కుంట కనిపించకుండా పోవడం విశేషం.

- రాత్రికి రాత్రే చెరువులను మట్టితో నింపుతున్న కేటుగాళ్లు
- అధికారులు హెచ్చరిస్తున్నా వెనక్కి తగ్గని కబ్జా రాయుళ్లు
- చెరువు శిఖాన్ని కాపాడాలని రైతులు, మత్స్యకారుల విన్నపం

మిర్యాలగూడ :చెరువు శిఖం భూములు కబ్జాకు గురవుతున్నాయి. శిఖం భూముల్లో చెరువు మట్టి నింపి చదును చేసి కంచె ఏర్పాటు చేసుకుని తమ ఆధీనంలోకి తెచ్చుకుంటున్నారు. ప్రధానంగా మిర్యాలగూడ నియోజకవర్గంలోని మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి, మాడ్గులపల్లి, వేములపల్లి మండలాల్లో ఉన్న చెరువు భూములు కబ్జాదారుల పాలవుతున్నాయి. గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా ఆ పార్టీ నాయకులు చేసిన అక్రమాలు, కబ్జాలను వేలెత్తి చూపిన కాంగ్రెస్ నాయకులు.. ఇప్పుడు వారు అధికారంలోకి రాగానే అదే కబ్జాల పర్వాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

తగ్గుతున్న చెరువు శిఖం

- మిర్యాలగూడ మండలంలోని రుద్రారం గ్రామంలోని రుద్రప్ప చెరువు సర్వే నంబర్ 117లో 310 ఎకరాలు ఉండగా అందులో 140 ఎకరాలు కబ్జాకు గురైనట్లు గతంలో 'సాక్షి' వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు స్పందించి విచారణ చేసి చెరువు కబ్జాను అరికట్టాలని, హద్దులు నిర్ణయించాలని ఐబీ అధికారులను ఆదేశించారు.
- మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి పందిర్లపల్లి చెరువు సర్వే నంబర్ 32 మిర్యాలగూడ శివారులోని సర్వే నంబర్ 118ను కలుపుకుని సుమారు 480 ఎకరాల్లో చెరువు విస్తరించి ఉంది. ఇందులో ఇప్పటికే సగానికి పైగా కబ్జాకు గురైంది. సర్వే నంబర్ 116, 117లో మొత్తం ఎకరన్నర పట్టా ఉండగా దానికే ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 118లో 203.26ఎకరాల చెరువు శిఖం భూమి కలిగి ఉంది. దాంతోపాటు సర్వే నంబర్ 114లో 128.38 ఎకరాల బంచరాయి భూములు ఉన్నాయి. సర్వే నంబర్ 114లో బంచరాయి భూమి పూర్తిగా కబ్జా గురైంది. ఎకరన్నర పట్టా భూమి కలిగిన వారు ఆ భూమిని ఎప్పుడో అమ్మేసుకుని శిఖం, బంజరు భూములను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. వీరంతా ధనవంతులు కావడం, అధికార అండ ఉండడంతో వారిని ప్రశ్నించేవారు లేకుండా పోయారని పలువురు పేర్కొంటున్నారు.

సుందరీకరణ పేరుతో..

పందిర్లపల్లి చెరువును సుందరీకరణ చేసి పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో బోటింగ్ ఏర్పాటు చేశారు. అందులో భాగంగానే ఈ భూములను కబ్జా చేసేందుకు గతంలో ఉన్న నాయకులు తెర లేపారు. బంజరు, శిఖం భూముల గుండా పోవాల్సిన నెక్లెస్ రోడ్డును మార్చేసి చెరువు సమీపం నుంచి తీయడంతో కబ్జాకు అవకాశం దొరికింది. దీన్ని అదునుగా భావించి తమ పొలం ఇక్కడి వరకు ఉందంటూ దౌర్జన్యంగా రాత్రికిరాత్రే నీళ్లు ఉన్న కుంటలను మట్టితో పూడ్చి చదునుచేసి తమ ఆధీనంలోకి తెచ్చుకుంటున్నారు.

కబ్జా చెర నుంచి కాపాడాలి



పందిర్లపల్లి చెరువు ద్వారా మత్స్య కార్మికులకు ఉపాధి లభిస్తుంది. ఎన్నో ఏండ్లుగా ఆ చెరువుపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ఇప్పుడు చెరువులో నీళ్లు లేకపోవడంతో చెరువు సమీపంలో ఉన్న భూములు కబ్జాకు గురవుతున్నాయి. దీని వల్ల చెరువు విస్తీర్ణం తగ్గిపోతుంది. చెరువు భూములను అధికారులు కాపాడాలి.

– గండెల శ్రీనివాస్, మత్స్యకార్మికుడు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం



చెరువు శిఖం భూముల కబ్జాపై ఇప్పటికే సంబంధిత అధికారులతోపాటు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. అధికారులు స్పందించి పందిర్లపల్లి చెరువును పూర్తిగా సర్వే చేయించి హద్దులు నిర్ణయించి శిఖం భూములను కాపాడాలి.

– నక్క నరసింహ, మత్స్య కార్మికుడు

సమగ్ర సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తాం

పందిర్లపల్లి చెరువు భూముల కబ్జాపై అనేక ఫిర్యాదులు అందాయి. ఈ విషయంపై ఇప్పటికే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి విచారణ చేపట్టాం. చెరువుకు సంబంధించిన అన్ని రికార్డులను తెప్పించుకుని దర్యాప్తు చేస్తున్నాం. చెరువు భూములు కబ్జాకు గురికాకుండా కాపాడేందుకు చెరువు చుట్టు హద్దులు పెట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించాం.

–శ్రీనివాస్‌రావు, ఆర్డీఓ, మిర్యాలగూడ

శిఖం భూమిని కాపాడాలి



చెరువును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కబ్జా నుంచి చెరువు శిఖం భూములను కాపాడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ కోరారు. మిర్యాలగూడ శివారులోని పందిర్లపల్లి చెరువులో కబ్జాకు గురైన భూమిని బుధవారం ఆయన సీపీఎం నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. అనుమతులు లేకుండా చెరువు మట్టిని ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా పెద్ద ఎత్తున తరలించి శిఖం భూముల్లో పోస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. చెరువు కబ్జాను అడ్డుకోకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు మల్లు గౌతంరెడ్డి, పరుశురాములు, రామ్మూర్తి, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, దేవయ్య, రామారావు, సీతారాములు, బిక్కన్ పాల్గొన్నారు.

'గ్రాడ్యుయేట్' అభ్యర్థుల్లో టెన్షన్

- మొదటి ప్రాధాన్యతతో నెగ్గేనా..
- ద్వితీయ ప్రాధాన్యతతో విజయం దక్కేనా?
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్‌పై రాజకీయవర్గాల్లో చర్చ
- మొదటి ప్రాధాన్యత ఓట్లతో ఫలితం తేలకపోవచ్చన్న అంచనాలు
- గెలుపు ఓటములపై లెక్కలేసుకుంటున్న అభ్యర్థులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితంపై అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది. ఇటీవల జరిగిన వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ సరళిపై విశ్లేషణలు జోరుగా సాగుతున్నాయి. ఓట్ల లెక్కింపు జూన్ 5న జరుగనున్న నేపథ్యంలో మొదటి ప్రాధాన్యత ఓటుతో ఫలితం తేలుతుందా లేక ద్వితీయ ప్రాధాన్యత ఓటుతో విజయం సాధిస్తారా అన్న అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అభ్యర్థులు ఎవరికి వారే తాము విజయం సాధిస్తామనే ధీమాలో ఉన్నప్పటికి మొదటి ప్రాధాన్యత ఓటుతో బయట పడటం అంత తేలిక కాదని, రెండో ప్రాధాన్యత ఓటు ద్వారానే ఫలితం తేలే అవకాశం ఉన్నట్లు పేర్కొంటున్నారు. మొదటి ప్రాధాన్యత ఓటును వేసిన పట్టభద్రులు రెండోప్రాధాన్యత ఓటు ఏ అభ్యర్థికి ఇచ్చారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఈ ఎన్నికలకు 4,63,839 మంది పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోగా అందులో 3,36,013 మంది ఓటు వేశారు. 72.44 శాతం పోలింగ్ నమోదైంది. ఈ పోటీలో 52 మంది అభ్యర్థులు ఉన్నప్పటికి ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల మధ్యే పోరు సాగింది. ఇందులో మొదటి ప్రాధాన్యత ఓట్లు ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు కొందరు గుర్తింపు పొందిన అభ్యర్థులకు, స్వతంత్ర అభ్యర్థులకు కూడా పడే అవకాశం ఉంది. పోలైన ఓట్లలో 50 శాతానికి మించి ఒక్క ఓటు ఎవరికి అయితే అధికంగా వస్తుందో ఆ అభ్యర్థి విజయం సాధించినట్లుగా ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది. అయితే ప్రస్తుతం జరిగిన పోలింగ్ సరళిని బట్టి చూస్తే మొదటి ప్రాధాన్యతలో బయటపడే అవకాశాలు కనిపించడం లేదు. గతంలో మూడుసార్లు జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా మొదటి ప్రాధాన్యత ఓటుతో విజయం సాధించిన పరిస్థితి లేదు. రెండో ప్రాధాన్యత ఓటుతోనే విజయం సాధించారు.

ద్వితీయ ప్రాధాన్యత ఓటు ఎవరికో..

పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే 12 జిల్లాల్లో జరిగిన పోలింగ్ సరళిని బట్టి చూస్తే ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపారో అంచనా వేసే పరిస్థితి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలిచే అవకాశాలు తక్కువేనన్న చర్చ జరుగుతోంది. ఓటర్లు ఒకవేళ కాంగ్రెస్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తే రెండో ప్రాధాన్యత బీఆర్ఎస్‌కు వేశారా? బీజేపీకి వేశారా? అన్న దానిపై అంచనాలు లేవు. మొదటి ప్రాధాన్యత బీఆర్ఎస్ అభ్యర్థికి వేస్తే రెండో ప్రాధాన్యత కాంగ్రెస్‌కు ఇచ్చారా లేదా బీజేపీకి ఇచ్చారా, మొదటి ప్రాధాన్యత బీజేపీ అభ్యర్థికి ఇస్తే రెండో ప్రాధాన్యత కాంగ్రెస్, బీఆర్ఎస్‌లలో ఎవరికి ఇచ్చారన్న అంశాలపై పార్టీలు విశ్లేషణ చేస్తున్నాయి. రెండో ప్రాధాన్యతతోనే ఈ ఎన్నికల్లో గెలుపు దక్కువచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తమకు మొదటి ప్రాధాన్యత ఓట్లు ఎన్ని పడ్డాయి.. రెండో ప్రాధాన్యతలో ఎవరికి ఎక్కువ పడ్డాయి అనే దానిపై అభ్యర్థులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ నెల 27న ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు పోలింగ్ జరిగింది. బ్యాలెట్ బాక్సులన్నింటినీ నల్లగొండలోని దుప్పలపల్లి స్టేట్ వేర్ హౌజింగ్ కార్పొరేషన్ గోదాముల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. జూన్ 5న ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది.

యూనిఫాం సిద్ధం చేయాలి

- అదనపు కలెక్టర్ పూర్ణచందర్‌రావు

మర్రిగూడ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్కూళ్ల ప్రారంభించే నాటికి అందించేలా చూడాలని అదనపు కలెక్టర్ టి.పూర్ణచందర్‌రావు కోరారు. బుధవారం మర్రిగూడ గ్రామపంచాయతీ వద్ద మహిళా సంఘాల ఆధ్వర్యంలో కుడుతున్న యూనిఫాం ఆయన పరిశీలించారు. అంతకుముందు ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో అమ్మ ఆదర్శ పాఠశాలల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలలో 70శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ భిక్షపతి, ఎంపీడీఓ జి.చినముసయ్య, ఎంఈఓ గురువారావు, డీపీఎం అరుణ్‌కుమార్, పీఆర్ ఏఈ యశ్వంత్, ఏపీఎం ప్రభాకర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సైదులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



యూనిఫాంను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మౌలిక వసతులు కల్పించాలి

నాంపల్లి : పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించాలని అదనపు కలెక్టర్ పూర్ణచందర్‌రావు ఆదేశించారు. నాంపల్లి మండలంలోని వడ్డెపల్లి, తుంగపహాడ్ ప్రభుత్వ పాఠశాలలను ఆయన డీఈఓ భిక్షపతితో కలసి పరిశీలించారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా అన్ని వసతులు కల్పించేలా చూడాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ స్వర్ణకుమారి తదితరులు ఉన్నారు.

క్లినిక్‌లలో టీఎంసీ సభ్యుల తనిఖీ



నల్లగొండలోని ఓ క్లినిక్‌లో తనిఖీ చేస్తున్న తెలంగాణ వైద్య మండలి సభ్యులు

నల్లగొండ టౌన్ : అర్హత లేకుండా నిర్వహించే క్లినిక్‌లను తెలంగాణ వైద్య మండలి (టీఎంసీ) సభ్యులు బుధవారం తనిఖీ చేశారు. జిల్లాలోని చండూరు, మునుగోడు, నల్లగొండతోపాటు పలు మండలాల్లో గ్రామీణ వైద్యులు నిర్వహిస్తున్న క్లినిక్‌లను మండలిసభ్యులు తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్నట్లు గుర్తించారు. ఎలాంటి అర్హత లేకుండా ఎంబీబీఎస్ వైద్యుల స్థాయిలో ఆర్ఎంపీ, పీఎంపీ అని బోర్డు పెట్టుకుని స్థాయికి మించి, పరిధిని దాటి వైద్యం చేస్తున్న 55 మంది నకిలీ వైద్యులపై ఎన్ఎంసీ చట్టం 3454 ప్రకారం కేసులు నమోదు చేశారు. క్లినిక్‌లలో బెడ్లు వేసి రోగులకు సెలైన్లు ఎక్కించడంతో పాటు యాంటిబయాటిక్, స్టెరాయిడ్ ఇంజక్షన్లను ఇస్తున్నట్లు, అబార్షన్లు, వివిధ రకాల సర్జరీలు చేస్తున్నట్లు మండలి సభ్యులు గుర్తించారు. అర్హత లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్‌లను మూసి వేయాలని హెచ్చరించారు. ఈ దాడుల్లో మండలి ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, లీగల్ యాంటి క్వాకరీ బృందం సభ్యులు డాక్టర్ శేషమాధవ్, ఎఫ్ఎంజీ చైర్మన్ డాక్టర్ శ్రీకాంత్‌వర్మ, నరేష్‌కుమార్, రవికుమార్, విష్ణు, ఇమ్రాన్ అలీ, రాజీవ్ నాయక్, సంతోష్‌రెడ్డి, పుల్లారావు, దైవాదీనం, రమేష్, ఫణికుమార్ పాల్గొన్నారు.

ప్రతి అణువులో భగవంతుడు ఉన్నాడు



చినజీయర్ స్వామి ప్రవచనాలు వింటున్న భక్తులు

రామగిరి(నల్లగొండ) : ప్రతి అణువులోనూ భగవంతుడు ఉన్నాడని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి పేర్కొన్నారు. నల్లగొండలో అక్కినేపల్లి లక్ష్మణరావు, శ్రీదేవి దంపతుల నివాసంలో ప్రముఖ ప్రవచనకర్త నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య ఆధ్వర్యంలో జరుగుతున్న భాగవత సప్తాహానికి చినజీయర్‌స్వామి బుధవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.



ప్రవచిస్తున్న చినజీయర్ స్వామి

భాగవత సప్తాహం చేయడం మాత్రమే కాకుండా భాగవతంలో విన్నదాన్ని ఆచరించే ప్రయత్నం చేయాలని భక్తులకు సూచించారు. భగవంతుడిని ప్రేమించడం నేర్చుకోవాలన్నారు. రామకృష్ణమాచార్య ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో చేయాలని మంగళ శాసనాలు చేశారు. కార్యక్రమంలో అక్కినేపల్లి లక్ష్మణరావు, శ్రీదేవి, జడల సువర్ణ, అక్కినేపల్లి పద్మావతి, పద్మావతి, చక్కిలం వేణుగోపాలరావు, శ్రీరంగంపల్లి రమాదేవి తదితరులు పాల్గొన్నారు

విత్తన దుకాణాలపై విజిలెన్స్ దాడులు

నల్లగొండ అగ్రికల్చర్ : వ్యాపారులు రైతులకు నకిలీ పత్తి విత్తనాలను అంటగట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రకాశంబజార్‌లో గల విత్తనాలు, ఎరువుల, పురుగు మందుల దుకాణాలను జిల్లా విజిలెన్స్‌అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు వ్యవసాయ శాఖాధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. తనిఖీల సందర్భంగా ధరల పట్టిక సక్రమంగా లేకపోవడం స్టాక్ రిజిస్టర్లలో పత్తి విత్తనాల వివరాలు రాకపోవడం వంటి వాటిని గుర్తించి వెంటనే పత్తి విత్తనాల అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశించారు. ధరల పట్టికను సక్రమంగా ప్రదర్శించాలని, స్టాక్ ఎంట్రీని సక్రమంగా ఉండాలని ఆదేశించారు. విత్తనాలను ఎమ్మార్పీ ఎక్కువ ధరకు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలను అమ్మే వ్యాపారుల ఆట కట్టించేందుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న విత్తన దుకాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. వ్యాపారులు కూడా అధికారులకు సహకరించి రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని సూచించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ శ్రీకాంత్, సీఐ గౌస్, వ్యవసాయధికారి శ్రీనివాస్, రాంబాబు, భవాని శంకర్, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రకాశంబజార్‌లోని విత్తన దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్‌అధికారులు

మళ్లీ భానుడి భగభగలు

నల్లగొండ టౌన్ : కొద్ది రోజులుగా శాంతించిన భానుడు, బుధవారం భగభగ మండాడు. పది రోజులుగా వాతావరణం చల్లబడి ఉష్ణోగ్రతలు తగ్గడంతో ప్రజలు ఉపశమనం పొందారు. తిరిగి భానుడు తన ప్రతాపాన్ని చూపడంతో ఎండ మండిపోయింది. బుధవారం అత్యధికంగా మునుగోడు మండలం గూడపూర్‌లో 44.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కట్టంగూర్‌లో 44.4 డిగ్రీలు, దామరచర్లలో 44.0 డిగ్రీలు నమోదుకాగా.. అత్యల్పంగా గుండ్లపల్లి మండలం ఎర్రారంలో 39.3 డిగ్రీలు నమోదయ్యాయి. ఇక.. కేతేపల్లి, నిడమనూరు, చిట్యాల, పజ్జూర్, పి.దోమలపల్లి, వెలుగుపల్లి, నాంపల్లి, నకిరేకల్, చండూరు, నల్లగొండ ట్రాన్స్‌కో కార్యాలయం, తడకమళ్ల, మాడ్గులపల్లిలో 43 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత నమోదైంది. మామిడాల, శివన్నగూడెం, బుగ్గబాయిగూడెం, పుల్లెంల, నల్లగొండ కలెక్టరేట్, తిమ్మాపురం, నార్కట్‌పల్లి, అయిటిపాములలో 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రేవులగడ్డ, నెమ్మాని, శాలిగౌరారం, మటూరు, కనగల్, టిక్యాతండా, ఈదులూరు, గుర్రంపోడు, కామిరెడ్డిగూడెంలో 41 డిగ్రీలు, పడమటిపల్లి, కొండాపురం నీటి ప్లాంటు, నేరడుగొమ్ము, మల్కచర్ల, యాచారం, తెల్దేవర్‌పల్లి, మర్రిగూడ, ఇబ్రహీంపేట, జూనూతల, ముదిగొండలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది.



క్లుప్తంగా

నిరుపేద వృద్ధురాలి అంత్యక్రియలకు చేయూత

రామన్నపేట: గ్రామస్తుల చేయూతతో నిరుపేద వృద్ధురాలి అంత్యక్రియలు నిర్వహించిన ఘటన రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామంలో బుధవారం జరిగింది. వివరాలు.. బతుకుదెరువు నిమిత్తం సంస్థాన్ నారాయణపురం నుంచి తిరందాసు కమలమ్మ(75) అనే మహిళ కొన్నేళ్ల క్రితం తన కుమారుడితో కలిసి వెల్లంకి గ్రామానికి వలస వచ్చింది. వారు వెల్లంకి శివాలయం ప్రాంగణంలో తాత్కాలిక గుడారం(బస్తాలతో) ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కమలమ్మ బుధవారం మృతిచెందింది. ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్‌రెడ్డి రూ.5వేలు, మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి రూ.5వేలు, గ్రామస్తులు తమకు తోచినంత అందజేసిన ఆర్థికసాయంతో కమలమ్మ అంత్యక్రియలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

వలిగొండ: మండలంలోని టేకులసోమారం సమీపంలో లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. తుర్కపల్లి మండలం పెద్దతండాకు చెందిన మాలోత్ భూచ్యా ద్విచక్ర వాహనంపై వలిగొండ మండలంలోని పొద్దటూర్ నుంచి తాటిముంజలు తీసుకొని హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యలో టేకులసోమారం సమీపంలో ఎదురుగా వచ్చిన లారీ అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భూచ్యాకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వీధి కుక్కల దాడి.. వృద్ధుడికి గాయాలు


గాయపడిన సాయిలు

ఆత్మకూరు(ఎం): వీధి కుక్కల దాడిలో వృద్ధుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆత్మకూరు(ఎం)మండలంలోని పల్లెర్ల గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్లెర్ల గ్రామానికి చెందిన తాడూరి సాయిలు బుధవారం మధ్యాహ్నం తన ఇంటి ఆవరణలో నిద్రించగా.. వీధి కుక్కలు ఒక్కసారిగా అతడిపై దాడి చేశాయి. ఈ ఘటనలో సాయిలు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడిని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

ట్రాక్టర్ బోల్తాపడి బాలుడు మృతి


విష్ణువర్ధన్ (ఫైల్)

మునుగోడు: ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడి బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం మునుగోడు మండలం కొరటికల్ గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొరటికల్ గ్రామానికి చెందిన అన్నం నరేష్ తన పెద్ద కుమారుడు విష్ణువర్ధన్(16)తో కలిసి ట్రాక్టర్‌పై గ్రామంలోని కోమటికుంట కట్ట మీదుగా తన వ్యవసాయ భూమి వద్దకు బుధవారం సాయంత్రం సమయంలో వెళ్తున్నాడు. అయితే కట్టపై ట్రాక్టర్ అదుపుతప్పడంతో బోల్తా పడింది. ఇది గమనించిన నరేష్ పక్కకు దూకగా.. పక్కనే కూర్చున్న అతడి కుమారుడు విష్ణువర్ధన్ ట్రాక్టర్ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని మునుగోడు పోలీసులు తెలిపారు.

జీవనభృతి ఇప్పించండి సారూ..!

- మా కుమారుడు పట్టించుకోవడం లేదు
- వృద్ధ దంపతుల ఆవేదన


పాపిరెడ్డి, సుగుణమ్మ దంపతులు

ఆత్మకూర్.ఎస్(సూర్యాపేట) : కనీసం అన్నం పెట్టక పోగా.. కష్టపడి సంపాదించిన భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నాడని, ఈ విషయమై న్యాయం కోసం అధికారుల వద్దకు వెళితే.. ప్రతినెలా జీవనభృతి ఇవ్వాల్సిందిగా చెప్పారని, ఆ ఆదేశాలను తమ కుమారుడు పట్టించుకోవడం లేదని వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మకూర్.ఎస్ మండలం పాత సూర్యాపేట గ్రామ పంచాయతీ పరిధిలోని శంకరన్నగూడెంకు చెందిన సామ పాపిరెడ్డి, సుగుణమ్మ దంపతులకు కుమారుడు సామ శంకర్‌రెడ్డితో పాటు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలందరికీ వివాహాలు జరిగాయి. గ్రామంలో పాపిరెడ్డికి రెండెకరాల పొలం ఉంది. శంకర్‌రెడ్డి హైదరాబాదులో ప్రైవేట్ జాబ్ చేస్తూ అక్కడే స్థిరపడ్డాడు. పదేళ్ల క్రితం తల్లిదండ్రులకు తెలియకుండానే రెండెకరాల భూమిని తన పేరు పట్టా చేయించుకున్నాడు. నాటి నుండి తమపై కుమారు శంకర్‌రెడ్డితో పాటు కోడలు వేధింపులు ఎక్కువయ్యాయని ఆ వృద్ధ దంపతులు తెలిపారు. పొలాన్ని సాగు చేసుకోనివ్వకుండా అడ్డుకోవడంతో పాటు ఇంట్లోంచి వెళ్లిపోవాలని పలుమార్లు తమతో శంకర్ రెడ్డి ఘర్షణ పడ్డారని, తమకు గాయాలయ్యాయని పాపిరెడ్డి, సుగుణమ్మ చెప్పారు. పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు.

ఆర్డీఓ ఆదేశాలు బేఖాతరు...

వృద్ధాప్యంలో ఉన్న తాము జీవనానికి ఇబ్బందులు పడుతున్నామని, నెలనెలా మందులకు ఖర్చు అవుతుందని పింఛన్ మీదనే ఆధారపడి కాలం వెళ్లదీస్తున్నామని అంటున్నారు. తమకు జీవనభృతి ఇప్పించాలని మార్చి నెలలో కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోగా సూర్యాపేట ఆర్డీఓను విచారణ జరపాలని ఆదేశించారు. దీంతో విచారణ జరిపిన ఆర్డీఓ వేణుమాధవ్‌రావు.. ప్రతినెలా భృతికింద రూ.10వేలు వారి ఖాతాలో జమ చేయాలని, రూ.2లక్షలను తల్లిదండ్రుల పేరున డిపాజిట్ చేయాలని మార్చి 5వ తేదీన ఉత్తర్వులు జారీచేశారు. అయినా ఈ ఉత్తర్వులను తమ కుమారుడు శంకర్‌రెడ్డి అమలు చేయడం లేదని, పైసా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతిలో డబ్బులు లేకపోవడంతో ఒక్కోసారి ఉపవాసం ఉండాల్సి వస్తుందని, ఉపాధి హామీ పనికి పోయి కాలం వెళ్లదీస్తున్నామని చెప్పారు. కొన్నిసార్లు తమ కూతుళ్లు ఆదుకుంటున్నారని, వారి మీద ఆధారపడి బతకాల్సి వస్తుందని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

ఆదేశాలు పాటించాలి

శంకన్నగూడెంకు చెందిన పాపిరెడ్డి దంపతులకు వారి కుమారుడు ప్రతినెలా రూ.10వేల జీవనభృతి ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చాం. జీవనభృతి ఇవ్వడం లేదన్న విషయం మా దృష్టికి రాలేదు. మా ఆదేశాలను పాటించకుంటే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– వేణుమాధవ్‌రావు, సూర్యాపేట ఆర్డీఓ

సూర్యాపేట ఎస్పీ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా

- ఎవరూ స్పందించవద్దన్న ఎస్పీ

సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే పేరుతో సైబర్ నేరగాళ్లు రెండు నకిలీ ఫేస్‌బుక్ ఖాతాలను క్రియేట్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఎస్పీ రాహుల్ హెగ్డే పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా ద్వారా ఫ్రెండ్ రిక్వెస్ట్ రావడంతో చాలామంది యాక్సెప్ట్ చేశారు. కొద్దిసేటికే వారితో మెస్సెంజర్‌లో చాటింగ్ ప్రారంభించి కొంత మొత్తం నగదు కావాలని.. ఫోన్‌పే చేస్తే రేపే తిరిగిచ్చేస్తా అంటూ మెసేజ్ చేస్తున్నారు. ఇది గమనించిన కొంతమంది పోలీసులు ఎస్పీకి సమాచారం ఇవ్వడంతో ఆయన అప్రమత్తమై బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తన పేరుపై నకిలీ ఫేస్‌బుక్ ప్రొఫైల్ క్రియేట్ చేశారని, దానికి ఎవరూ స్పందించవద్దని, డబ్బులు పంపించవద్దని కోరారు. ఫేస్‌బుక్ నుంచి ఎవరైనా నంబర్ అడిగినా, డబ్బులు అడిగినా ఇవ్వొద్దన్నారు. ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

భూమి గెట్టు వివాదం.. యువకుడి ఆత్మహత్యాయత్నం


పురుగుల మందు డబ్బాతో కార్తీక్

నార్కట్‌పల్లి: భూమి గెట్టు వివాదంతో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యాయత్నం చేశఋాడు. ఈ ఘటన బుధవారం నార్కట్‌పల్లి మండలం చిన్ననారాయణపురం గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లికి చెందిన జినకల ఆనంద్‌కు చిన్ననారాయణపురం గ్రామంలో భూమి ఉంది. ఆనంద్‌కు, అతడి పక్కన భూమి ఉన్న వ్యక్తుల మధ్య గత రెండు నెలలుగా గెట్టు వివాదం కొనసాగుతోంది. బుధవారం ఆనంద్ భూమి వద్ద ఇతరులు హద్దురాళ్లు పాతుతుండగా.. అతడి కుమారుడు జినకల కార్తీక్ అడ్డుకొని తమ భూమిలో ఎందుకు హద్దురాళ్లు పాతుతున్నారని నిలదీశాడు. దీంతో వారి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో కార్తీక్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చుట్టుపక్కల ఉన్న వారు అడ్డుకొని కార్తీక్‌ను వెంటనే నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు.

వాలీబాల్ పోటీలో పందెం డబ్బులపై వివాదం

- పరస్పరం దాడి చేసుకున్న రెండు జట్ల సభ్యులు
- ఐదుగురిపై కేసు నమోదు


యువకుడిని చితకబాదుతున్న దృశ్యం

మిర్యాలగూడ అర్బన్: వాలీబాల్ పోటీలో రెండు జట్ల మధ్య పందెం డబ్బులపై జరిగిన వివాదం ఘర్షణకు దారితీసింది. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. మిర్యాలగూడ మండలంలోని చింతపల్లి గ్రామం, దామరచర్ల మండలం దిలావర్‌పూర్‌కు చెందిన యువకులు ఇటీవల వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మొదట నిర్వహించిన పోటీలో దిలావర్‌పూర్ జట్టు గెలుపొందగా.. రెండోసారి నిర్వహించిన పోటీలో చింతపల్లి జట్టు గెలిచింది. ఈ రెండు జట్ల మధ్య పందెం డబ్బులు రూ.1000 విషయంలో వివాదం నెలకొంది. మొదట దిలావర్‌పూర్ జట్టు వారు చింతపల్లి జట్టు యువకులపై దాడి చేశారు. ఈ దాడిని దృష్టిలో ఉంచుకుని దిలావర్‌పూర్ జట్టులో సభ్యుడైన మిర్యాలగూడ పట్టణంలోని మెడికల్ షాపులో పనిచేసే నవీన్ అనే యువకుడిని చింతపల్లి జట్టు యువకులు చితకబాదగా.. వారిని అడ్డుకోబోయిన మరో యువకుడు రాకేష్‌ను సైతం తీవ్రంగా కొట్టారు. ఈ దాడి జరుగుతున్న దృశ్యాలను కొందరు సెల్‌ఫోన్లలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వెలుగులోకి వచ్చింది. ఈ గొడవకు సంబంధించి ఐదుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు మిర్యాలగూడ వన్‌టౌన్ ఎస్‌ఐ రాంబాబు పేర్కొన్నారు.

'పుడమి' బాధితుల న్యాయ పోరాటం

- ప్రత్యేక సంఘం ఏర్పాటు
- ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడేందుకు కార్యాచరణ రూపకల్పన


ఘట్‌కేసర్‌లో సమావేశమైన పుడమి ప్రాజెక్ట్స్ బాధితులు

మునుగోడు: అధిక వడ్డీ ఆశచూపి లక్షల రూపాయలు వసూలు చేసి అజ్ఞాతంలోకి వెళ్లిన పుడమి ప్రాజెక్ట్స్ కంపెనీ నిర్వాహకులపై న్యాయ పోరాటం చేసేందుకు బాధితులు సిద్ధమవుతున్నారు. పుడమి ప్రాజెక్ట్స్ కంపెనీలో పెట్టుబడి పెట్టిన వారికి గత ఏడాది కాలంగా వడ్డీ ఇవ్వకపోగా, వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేస్తామన్న ప్లాట్లు కూడా ఇవ్వకుండా కాలయాపన చేసిన నిర్వాహకులు బాధితుల ఒత్తిడి తట్టుకోలేక ఇటీవల అజ్ఞాతంలోకి వెళ్లారు. ఈ విషయాన్ని గత నెల 16వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురించగా బాధితులు అప్రమత్తమయ్యారు. ఆ రోజు నుంచి తమ చేత పెట్టుబడులు పెట్టించిన ఆ కంపెనీ డీజీఎం(కమీషన్ ఏజెంట్లు) వద్దకు వెళ్లి తమ డబ్బులు తమకు ఇవ్వాలని బాధితులు కోరారు. దీంతో ఆ ఏజెంట్లు తమ చేతిలో ఏమీ లేదని, కంపెనీ ఏర్పాటుచేసిన ముగ్గురి వద్దనే మొత్తం నగదు ఉందని, ఆ ముగ్గురు బయటికి వస్తేనే మీ డబ్బులు మీకు ఇపిస్తామని చెప్పారు. దీంతో పెట్టుబడి పెట్టిన వారంతా ఏమిచేయలో అర్థంకాక గత 15 రోజులుగా పుడమి ప్రాజెక్ట్స్ కంపెనీ నిర్వాహకుల గురించి ఆరా తీస్తున్నా ఎక్కడా వా.9రి ఆచూకీ లభించకపోవడంతో తమ చేత డబ్బులు పెట్టుబడి పెట్టించిన డీజీఎంలతో పాటు పుడమి కంపెనీ నిర్వాహకులపై న్యాయ పోరాటం చేయాలని నిర్ణయించుకున్నారు.

సంఘం ఏర్పాటు చేసుకున్న బాధితులు..

బాధితులంతా వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకుని ప్రతిరోజు తమ బాధలను పంచుకునేవారు. ఐక్యంగా పోరాడితే తమకు న్యాయం జరుగుతుందని భావించిన బాధితులంతా మంగళవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొని న్యాయ పోరాటం చేసేందుకు గాను డివైన్ అండ్ పుడమి ఇన్‌ఫ్రా బాధితుల సంఘం అనే పేరుతో సంఘం ఏర్పాటు చేసుకున్నారు. న్యాయం జరగాలంటే ప్రజాస్వామ్య పద్ధతిలో ఎలా ముందుకెళ్లాలి, ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలనే విషయాలను చర్చించుకున్నారు. అంతే కాకుండా మోసగాళ్లు అని ఓ ఫ్లెక్సీ ముద్రించి ఆ కంపెనీని కొనసాగించిన వారి ఫొటోలతో పాటు వారి పేర్లను ముద్రింపజేశారు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి రోడ్డున పడ్డ తమను పోలీసులు ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

- అవయవదానం చేసిన కుటుంబ సభ్యులు


మావిళ్ల వెంకటేష్ (ఫైల్)

చింతపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయ్యి బుధవారం మృతి చెందాడు. వైద్యుల సూచన మేరకు మృతుడి కుటుంబ సభ్యులు అతడి అవయవాలను దానం చేశారు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన ప్రకారం.. చింతపల్లి మండల కేంద్రానికి చెందిన మావిళ్ల వెంకటేష్(25) గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 24న బైక్‌పై మాల్‌లో పత్తి విత్తనాలు కొనుగోలు చేసేందుకు వెళ్తుండగా.. హైదరాబాద్ నుంచి మల్లేపల్లి వైపు వస్తున్న కారు ఎదురుగా వచ్చి వెంకటేష్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం అతడిని హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయ్యి బుధవారం మృతిచెందాడు. వైద్యుల సూచన మేరకు వెంకటేష్ గుండె, కిడ్నీలను కుటుంబ సభ్యుల దానం చేశారు. అనంతరం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి స్వగ్రామమైన చింతపల్లికి తీసుకొచ్చారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.


పోలీసులతో వాగ్వాదానికి దిగిన బంధువులు

కుటుంబ సభ్యుల ధర్నా..

అయితే ప్రమాదానికి కారణమైన కారు యజమాని నుంచి రూ.20లక్షల పరిహారం అందించాలని కోరుతూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు చింతపల్లి మండల కేంద్రంలోని ఇన్‌స్పెక్షన్ బంగ్లా వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్య, చింతపల్లి ఎస్‌ఐ యాదయ్య అక్కడకు చేరుకుని వారికి ఎంత నచ్చజెప్పినా వినిపించుకోకుండా వాగ్వాదానికి దిగారు. స్థానిక నాయకులు కలగజేసుకొని పరిహారం ఇప్పించేలా చూస్తామని నచ్చజెప్పడంతో సమస్య సద్దుమణిగింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ యాదయ్య తెలిపారు.

ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి బలవన్మరణం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నిడమనూరు: గుర్తుతెలియని వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన నిడమనూరు మండలంలోని వెంగన్నగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగన్నగూడెం శివారులో గల గోదాంలో సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి రెండు మూడ్రోజుల కిందట పత్తి తూకానికి వాడే స్టాండ్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అక్కడ పనిచేసే గూర్ఖా బహదూర్ మూడు, నాలుగు రోజులకు ఒకసారి గేదెలకు గడ్డి తేవడానికి గోదాం వద్ద వెళ్తుంటాడు. బుధవారం గూర్ఖా గడ్డి తేవడానికి గోదాం వద్దకు వెళ్లిన సమయంలో దుర్వాసన వస్తుండడంతో లోపలికి వెళ్లి చూడగా గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామ పంచాయతీ కార్యదర్శి శోభారాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. హాలియా సీఐ జనార్దన్, ఎస్‌ఐ నరేష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య


నితిన్ (ఫైల్)

భువనగిరి క్రైం: కుటుంబ కలహాలతో కలత చెందిన యువకుడు క్వారీ గుంతలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భువనగిరి పట్టణ పరిధిలోని రాంచంద్రాపురం రోడ్డులో బుధవారం జరిగింది. వివరాలు.. యాదగిరిగుట్ట మండలం చొల్లేరుకు చెందిన దొంతిసారం శంకర్ కుటుంబ సభ్యులతో భువనగిరి పట్టణంలోని ఆజాద్ రోడ్‌లో నివాసముంటున్నాడు. ఈ నెల 25, 26 తేదీల్లో సొంతూరు చొల్లేరులో బోనాల పండుగ ఉండడంతో కుటుంబంతో కలిసి వెళ్లాడు. శంకర్‌కు ముగ్గురు సోదరులు ఉన్నారు. అయితే గతంలో ఉమ్మడి కుటుంబంగా బోనాలు తీయగా.. అన్నదమ్ములు వేర్వేరుగా బోనాలు తీయాలని నిర్ణయించుకున్నారు. కానీ చొల్లేరు వెళ్లిన శంకర్ భార్యాపిల్లలను వదిలి తన సోదరుల ఇళ్లకు వెళ్లి భోజనం చేసి వచ్చాడు. వేర్వేరుగా బోనాలు తీయాలని నిర్ణయించుకొని, మళ్లీ సోదరుల ఇంటికి వెళ్లి భోజనం ఎలా చేసి వస్తావని శంకర్‌కు తన భార్య, పిల్లలకు మధ్య గొడవ జరిగింది. బోనాల పండుగ అనంతరం భువనగిరికి వచ్చిన తర్వాత కూడా ఇదే విషయమై వారి మధ్య మరోసారి గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన శంకర్ కుమారుడు దొంతిసారం నితిన్(19) బుధవారం భువనగిరి పట్టణ పరిధిలోని రాంచంద్రాపురం రోడ్డులో గల క్వారీ గుంతలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశారు. నితిన్ మృతదేహానికి భువనగిరి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

ఆస్పత్రి ఎదుట మృతుడి బంధువుల ఆందోళన

- మిర్యాలగూడ పట్టణంలో ఘటన

మిర్యాలగూడ అర్బన్: వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరిన వ్యక్తి మృతిచెందాడని అతడి బంధువులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో బుధవారం రాత్రి జరిగింది. వివరాలు.. మిర్యాలగూడ మండలం పరిధిలోని వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన శేఖర్(30) మంగళవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో కుటుంబ సభ్యులు మిర్యాలగూడ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆ యువకుడు పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. కాగా ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శేఖర్ మృతిచెందాడని అతడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని వారితో మాట్లాడారు. మధ్యవర్తుల జోక్యంతో మృతుడి కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

బావిలోని నీరు కలుషితం.. చేపలు మృతి


మృతిచెందిన చేపలు

భువనగిరి టౌన్: పట్టణంలోని ఖాజీమొహల్లాలోని జమాలుల్ బహార్ దర్గా ఆవరణలో ఉన్న బావిలోని చేపలు బుధవారం మృత్యువాత పడ్డాయి. దర్గా వద్దకు వచ్చే వారు చేపల కోసం బ్రెడ్, ఇతర వస్తువులు నీటిలో వేస్తారని.. అవి కుళ్లిపోయి లేదా కల్తీ జరగడంతో నీరు విషతుల్యమై చేపలు మృతిచెంది ఉంటాయని స్థానికులు, ఆ వార్డు కౌన్సిలర్ స్వామి తెలిపారు. మున్సిపల్ సిబ్బంది చనిపోయిన చేపలను బావిలో నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. బావిలోని నీటిని మొత్తం తీసి తిరిగి శుద్ధమైన నీటితో నింపుతామని తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

రామగిరి(నల్లగొండ): హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు సెషన్స్ కోర్టు జడ్జి ఎన్. రోజారమణి బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. తిరుమలగిరి మండలం రంగుండ్ల గ్రామానికి చెందిన అంగోతు హనుమ(20) తన స్నేహితుడు ధారావత్ పాండుతో కలిసి 2014 ఏప్రిల్ 19వ తేదీ రాత్రి చేపలు పట్టేందుకు రాజవరం చెరువు వద్దకకు వెళ్లారు. చెరువుకు కాపలా ఉన్న సొడబోయిన లింగయ్య వారిని చూసి కేకలు వేయడంతో ధారావత్ పాండు తప్పించుకుని పారిపోయాడు. అక్కడే ఉన్న హనుమ తలపై లింగయ్య కర్రతో గట్టిగా మోదడంతో అతడు నీటిలో పడి మృతిచెందాడు. మరుసటి రోజు చూసేసరికి హనుమ మృతదేహం నీటిపై తేలియాడుతుండడంతో లింగయ్య ఎవరికి అనుమానం రాకుండా మృతదేహాన్ని పక్కనే ఉన్న చెట్ల పొదల్లో పడేశాడు. అనంతరం హనుమ మృతదేహాన్ని గుర్తించి అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న మృతుడి తండ్రి పుల్యా అనుముల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న అప్పటి మిర్యాలగూడ డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్, అనుముల ఎస్‌ఐ భోజ్యా నాయక్ కేసు నమోదు చేసి విచారణ అనంతరం నిందితుడు లింగయ్యను కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసు తుది విచారణలో భాగంగా బుధవారం జడ్జి ఎన్. రోజారమణి సాక్ష్యాధారాలు పరిశీలించి నిందితుడు సొడబోయిన లింగయ్యకు జీవిత ఖైదుతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

నిషేధిత గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని పలు కిరాణా దుకాణాల్లో బుధవారం పోలీసులు తనిఖీలు నిర్వహించి 1264 నిషేధిత గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.8వేలు ఉంటుందని, నిషేధిత గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్న పలువురిపై పోలీసులు కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పరమేష్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నేరేడుచర్ల: మండలంలోని చిల్లేపల్లి వద్ద అక్రమంగా తరలిస్తున్న రెండు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని బుధవారం రాత్రి నేరేడుచర్ల పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. చిల్లేపల్లి వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా మిర్యాలగూడకు చెందిన చిట్టిపోలు పర్వతాలు, ఆయన అనుచరుడు దేవరబోయిన పల్లయ్య నేరేడుచర్ల నుంచి మిర్యాలగూడ వైపు బొలేరో వాహనంలో రెండు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా పట్టుబడ్డారు. పట్టుబడిన బియ్యాన్ని, బొలేరో వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి.. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దొంగలకు దేహశుద్ధి.. పోలీసులకు అప్పగింత

భువనగిరి క్రైం: పట్టణంలోని హుస్నాబాద్ పరిధిలో గల ఇందిరమ్మ కాలనీ వద్ద విద్యుత్ వైర్లు దొంగతనం చేస్తున్న ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులకు స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాలు.. ఇందిరమ్మ కాలనీ వద్ద ఇటీవల విద్యుత్ అధికారులు కొత్త విద్యుత్ లైన్ వేయగా అక్కడ వేలాడుతున్న కరెంట్ వైర్లను ఇద్దరు వ్యక్తులు దొంగిలిస్తుండగా స్థానికులు గమనించి వారిని నిలదీశారు. కొద్దిదూరం వెళ్లిన వారు మళ్లీ అదే ప్రయత్నం చేస్తుండగా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పట్టణ ఎస్‌ఐ నాగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, & 9253560455. [T-1262254]

అద్దెకు ఇవ్వబడును

■ In Miryalaguda Two Buildings are available for Rent Sutiable for School, Colleges and Hostels with Good Water Facility. Cont: Cell: 9030472337 [Y-798454]

వధువు కావలెను

■ కోమట్ల అమ్మాయి కావలెను. కోమట్ల అబ్బాయి 36 M.Sc ప్రైవేట్ లెక్చరర్ 32 వేలు, ఆస్తి 80 లక్షలు. వీరయ్య MIG-9, హౌజింగ్‌బోర్డు, మునుగోడ్ రోడ్, నల్లగొండ. సెల్: 9121325068 [Y-798332]

Wanted

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185092]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం: 18K Ph: 9640258899/ 9640468899 [H-799885]

■ Hyd (ఉప్పల్) ప్రముఖ హోంకేర్ సంస్థలో పనిచేయుటకు లేడి టెలికాలర్స్-5, లేడి సూ॥ వైజర్స్-3, కేర్‌టేకర్స్ (M/F)-15 కా॥ జీ: 12000 to 18000 రూం+మీల్స్ ఫ్రీ Ph: 6300639598 [G-1498]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ.:220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
5% GST అదనం
వివరాలకు
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
నకిరేకల్ : 9010178203
సూర్యాపేట : 9912220740, 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అస్సెట్ రికవరీ బ్రాంచి-1 (కోడ్-05172), రెండవ అంతస్తు, టీఎస్ఆర్‌టీసీ కంప్యూటర్ ఎమెనిటీ సెంటర్, బస్ టెర్మినల్ కాంప్లెక్స్, కోఠి, హైదరాబాద్ - 500095, తెలంగాణ రాష్ట్రం. ఇ-మెయిల్: sbi.05172@sbi.co.in

APPENDIX - IV A [See proviso to Rule 8(6)]

ఇ-వేలం అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్స్ 8(6)లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తులు అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

[illegible] తేది.29.05.2024 [illegible] తేది.30-05-2024 [illegible] తేది.20-06-2024 [illegible]

స్థిరాస్తి వివరములు, రిజర్వు ధర, ధరావత్తు, బిడ్ పెంపుదల మరియు వేలం తేది & సమయం దిగువ తెలుపబడినవి

ఆస్తి ఐడి నెం. – SBIN781636219720 :- [illegible] Google Maps: 79.573639,16.865279

రిజర్వు ధర: రూ.1,51,00,000/- ధరావత్తు: రూ.15,10,000/- బిడ్ పెంపుదల: రూ.1,00,000/-
ఇ-వేలం తేదీ మరియు సమయం: 20-06-2024, ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 03.00 గం॥ల వరకు
వేలం పూర్తి అయ్యే వరకు ప్రతి 10 ని॥లకు ఒక సారి ఆటోమాటిక్ ఎక్స్‌టెన్షన్ ఉండును.

ఆస్తి తనిఖీ తేదీ మరియు సమయం : తేది.01.06.2024 నుండి 19.06.2024 వరకు, ఉ॥ 11.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు

1. [illegible] 94402 01771, 78806 23173 [illegible] https://www.mstcecommerce.com/auctionhome/ibapi/index.jsp హెల్ప్‌లైన్ +91-033-40645207, 40609118, 40645316, 22831602, 22891101, 22891005, 22901004, 22895064, ఇ-మెయిల్: ibapihelpdesk@mstcindia.co.in [illegible] https://ibapi.in [illegible]

తేది: 29-05-2024, ప్రదేశం: హైదరాబాద్ సం/- అధీకృత అధికారి, SBI, SARB-1, కోఠి, హైదరాబాద్